తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

కలెక్టరేట్‌లో నాగుపాము కలకలం

చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త: కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఓ నాగుపాము కలకలం సృష్టించింది. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో చెట్టు కింద వేసిన బండలపై కలెక్టరేట్‌లో అధికారులను కలవడానికి వచ్చిన ప్రజల మధ్యకు ఒక్కసారిగా నాగుపాము రావడంతో ప్రజలు భయాందోళనలకు గురై పరుగులు తీశారు. ఒక పావుగంట పాటు ఆ పావు అక్కడే తచ్చాడుతు వుండటంతో కలెక్టరేట్ సెక్యూరిటీ సిబ్బంది అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు పాములు పట్టే వాడిని పిలిపించి పామును పట్టివేశారు. పట్టివేసిన పామును సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదలినట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.

స్కిల్ హబ్ ఏర్పాటు పనులు త్వరితంగా పూర్తి

చిత్తూరు ఐటిఐను కలెక్టర్ అకస్మిక తనిఖీ

చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త: చిత్తూరు ఐటిఐలో స్కిల్ హబ్ ఏర్పాటు చేయడానికి అవసరమైన పనులు త్వరితంగా పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు కొంగారెడ్డిపల్లి ఎస్టేట్‌లోని ప్రభుత్వ ఐటిఐను బుధవారం కలెక్టర్ హరినారాయణన్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యార్హతలతో పాటు ఉపాధి కల్పించడానికి వారిలో నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రభుత్వం స్కిల్ హబ్‌లను ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించడానికి అవసరమైన ఏర్పాట్లతో పాటు త్వరితంగా స్కిల్ హబ్ ప్రారంభించడానికి అవసరమైన పనులను పూర్తి చేయాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గుణశేఖర్‌రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్‌తో పాటు డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, ఐటిఐ ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి తదితరులు వున్నారు.

బుట్ట అల్లితేనే బువ్వ

బుట్టలు అల్లుకుంటున్న నిరుపేదలు

దరిచేరని ప్రభుత్వ పథకాలు

ఓజిలి, అక్టోబర్ 12 ప్రభాతవార్త
పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని, బడ్జెట్‌లో కోట్లాది రూపాయలతో పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పడమే గాని పేదల దరిచేరడంలేదు. పేదలు ఎప్పటికీ పేదలుగానే మిగిలి పోతున్నారు. ఓజిలి మండలంలోని వందలాది కుటుంబాలు ఎరుకుల కుటుంబాలు నివసిస్తున్నాయి. నేటికీ పక్కాగృహాలు లేక చెట్ల కిందనో, పూడిగుడిసెల్లోనూ నివాసముంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కొందరికి పూట జరగక అర్ధాకలితో అలమటిస్తున్నారు. మరికొందరు అడవులకు వెళ్లి ఈతపుల్లలను కోసుకొచ్చి బుట్టలు అల్లి వాటిని అమ్మి వచ్చిన రూపాయితో బియ్యం కొనుక్కొని పూట గడుపుకుంటున్నారని తెలిపారు. పేదల కుటుంబాలకుఅండగా ప్రభుత్వ పథకాలు ఏమీ తమ దరికి చేరడం లేదని చెప్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు మాత్రం మీకు ఇవ్వాల్సిన పథకాలు మీకే ఇస్తున్నామని చెప్తున్నప్పటికీ తమ దరి చేరడం లేదని వాపోయారు. పాలకుల నిర్లక్ష్యం, ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా సొంత గూడు కూడా లేదని, ఇలా చెట్ల కిందనే బుట్టలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కొందరికి ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు కూడా లేవని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో సర్వే నిర్వహించి, తమ కులం వారిని గుర్తించి అందరికీ ఉపాధి అవకాశాలు, పింఛన్లు, ప్రభుత్వ పథకాలు కల్పించాలని కోరారు.

లోక్ అదాలత్‌లో వినియోగదారుల ఫోరం వివాదాలు పరిష్కారం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్

చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త: రాష్ట్ర హైకోర్టు, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ ఆథారిటీల ఆదేశాల మేరకు జిల్లాలో నవంబర్ 12వ తేదీ జరుగనున్న లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫోరంలోని వివాదాలకు పరిష్కారం చూపబడుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ పేర్కొన్నారు. చిత్తూరు పాత కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ విలేకరులతో మాట్లాడుతూ పారిశ్రామిక విప్లవం ప్రారంభమైనప్పటి నుండి వస్తువుల తయారీ, వినియోగం పెరిగిందన్నారు. ఫలితంగా వినియోగదారుల సంఖ్య పెరిగిందని, దీంతో వినియోగదారుల రక్షణ కోసం చట్టాలు రూపొందించడం జరిగిందన్నారు. ముఖ్యంగా 21వ శతాబ్దంలో వినియోగదారుల సంఖ్య పెరగడంతో వినియోగదారులకు, తయారీ సంస్థలకు మధ్య సమస్యలు తలెత్తడం జరుగుతున్నాయన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కాని పరిస్థితుల్లో వినియోగదారుని రక్షణ చట్టాల ప్రకారం జిల్లాలోని వినియోగదారుల ఫోరంలో వినియోగదారులు తమ సమస్యలను విన్నవించుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లా

విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ కార్యదర్శి ఐ.కరుణకుమార్

వినియోగదారుల ఫోరంలో ఇలాంటి వివాదాలు చాలా వున్నాయన్నారు. వీటిని సైతం రాష్ట్ర హైకోర్టు, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ ఆథారిటీల ఆదేశాల మేరకు నవంబర్ 12వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమంలో వినియోగదారుల ఫోరంలోని వివాదాలను సైతం పరిష్కరించడానికి అవకాశం వుందన్నారు. దీనికి సంబంధించి ఇరు వర్గాలతో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహిస్తామని ఇందులో ఇరు పార్టీలు పాల్గొని రాజీతో తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని ఆయన తెలిపారు.

విద్యార్థుల చేతుల్లో దేశ భవిష్యత్తు

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎంపీ రెడ్డప్ప

జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు.

చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాలలో బుధవారం జిల్లా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యతోనే నిరుపేదల కుటుంబాల్లో ఆర్థిక ఎదుగుదల వుంటుందని భావించి పిల్లల చదువు కోసం వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించి వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలపై శ్రద్ధ వహించాలని ఆయన పిలుపునిచ్చారు. సిఎం వైఎస్ జగన్ అర్హత వున్న విద్యార్థులకు అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అలాగే నాడు-నేడు కార్యక్రమం చేపట్టి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ దేశ సమగ్రత, సౌభ్రాతృత్వం కోసం విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించి వారికి లబ్ధి కల్గించడానికి నేరుగా తల్లుల ఖాతాల్లో నగదును జమ చేస్తున్నారని ఈ నగదును సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి విద్యలో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. నెహ్రూ యువకేంద్ర జిల్లా కో-ఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమంలో గెలుపొందిన వారికి నగదు బహుమతి ప్రదానం చేయడమే కాకుండా వీరు రాష్ట్ర స్థాయి యువ ఉత్సవ్ పోటీల్లో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. గత ఏడాది నిర్వహించిన కవితా పోటీల్లో గెలుపొందిన చిత్తూరు నగరంకు చెందిన కార్తీక్ అక్టోబర్ 31వ తేదీ దేశ పార్లమెంటు భవనంలో ప్రసంగించడానికి అవకాశం లభించిందన్నారు. ఇది మన జిల్లాకు దక్కిన గౌరవమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆనందరెడ్డి, మాస్ ఎన్జీఓ అధ్యక్షుడు గుణశేఖర్‌రెడ్డి, ఇతర కళాశాల అధ్యాపకులు, సంబంధిత అధికారులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతులు పొందిన విజేతలు:

వక్తృత్వం: సౌమ్య, లక్ష్మీ, మౌనిక, పెయింటింగ్: ప్రవీణ్‌కుమార్, దినేష్, రాజ్‌కుమార్‌లు, కవితా రచన: హస్మిత, కరీమున్నీసా, చందనప్రియలు, ఫోటోగ్రఫీ: జస్వంత్‌రెడ్డి, మోహిత్, నితిన్‌లు, కల్చరల్ ప్రొగ్రామ్స్: జాహ్నవి, యువప్రియ, మౌనికలు.

భక్తుల తలలపై పగిలిన కొబ్బరికాయలు..

ఘనంగా శ్రీ దొడ్డతిప్పస్వామి.. శ్రీ తిమ్మరాయస్వామి ఉత్సవాలు

భారీగా హాజరైన భక్తులు

కుప్పంరూరల్, అక్టోబర్ 12 ప్రభాతవార్త
కుప్పం పట్టణం కొత్తపేటలో వెలసిన శ్రీ దొడ్డతిప్పస్వామి, శ్రీ తిమ్మరాయస్వామి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు అభిషేకం, అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద మొక్కులు కలిగిన భక్తులు తలలపై టెంకాయలు పగలగొట్టుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాలకు కుప్పం నుంచే కాక కర్ణాటక నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ ఆలయ ప్రత్యేకత ఏంటంటే పరమశివుడు, మహావిష్ణువు ఒకే చోట కొలువై భక్తులకు దర్శనమిస్తారు. మరో విశేషం ఏమిట ంటే పరమశివుడు విగ్రహ రూపంలో ఇక్కడ భక్తులకు దర్శనమివ్వడం విశేషం. ఈ కార్యక్రమాల్లో చిత్తూరు ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి, కురబ సంఘం నేత ఆరేళ్ల జయప్ప, ఆలయ కమిటీ ఛైర్మన్ మునస్వామి, కెఎం శంకర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జడ్పీ సిఇఓకు ఝలక్

- బంగారుపాళ్యం ఎంపిడిఓ కార్యాలయం ఆకస్మిక తనిఖీ
- ఉదయం 11.40 గంటలకు టైపిస్ట్ మినహా కార్యాలయంలో కన్పించని మిగిలిన అధికారులు, సిబ్బంది
- జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం

బంగారుపాళ్యం ఎంపిడిఓ కార్యాలయంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డికి కన్పించని అధికారులు, సిబ్బంది

చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త: అకస్మిక తనిఖీల్లో భాగంగా బంగారుపాళ్యం ఎంపిడిఓ కార్యాలయంను తనిఖీ చేయడానికి వెళ్ళిన జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డికి ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది బుధవారం ఝలక్ ఇచ్చారు. ఎంపిడిఓ కార్యాలయంను తనిఖీ చేయడానికి వెళ్ళిన జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డికి కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎవ్వరు కన్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఒక్క టైపిస్టు మినహా మిగిలిన అధికారులు, సిబ్బంది ఎవరు కన్పించకపోవడంతో ఎలాంటి సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరైన అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకొంటామని జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఉదయం 11.40 గంటలకు బంగారుపాళ్యం ఎంపిడిఓ కార్యాలయంను అకస్మికంగా తనిఖీ చేయడానికి వెళ్ళారు. ఆ సమయంలో కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ అధికారులు ఎవరు కన్పించకపోవడంతో జడ్పీ సిఇఓ ఆశ్చర్యపోయి అధికారులు, సిబ్బంది కోసం ఎదురు చూశారు. ఒక్క టైపిస్టు మినహా మిగిలిన అధికారులు, సిబ్బంది జడ్పీ సిఇఓ వెళ్ళిన పది నిముషాలకు సైతం కార్యాలయంలోకి రాకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయ పని వేళల్లో ప్రజలకు అధికారులు, సిబ్బంది కచ్చితంగా అందుబాటులో వుండాలని ప్రభుత్వం బయోమెట్రిక్ హాజరు, ఇతర చర్యలు తీసుకొంటున్నప్పటికీ ఉదయం 11.40 గంటలు అవుతున్నా కార్యాలయంలో అధికారులు విధులకు హాజరు కాకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం విధులకు గైర్హాజరైన అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఇలాంటి పరిస్థితి మరోసారి ఉత్పన్నం అయితే కఠిన చర్యలు తీసుకొంటామని జడ్పీ సిఇఓ స్పష్టం చేశారు. అనంతరం జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి తిమ్మోజిపల్లి గ్రామ సచివాలయంను తనిఖీ చేశారు. ఈ సచివాలయంలో జడ్పీ సిఇఓ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి డిస్‌ప్లే బోర్డులు, పలు రికార్డులను పరిశీలించి అందుబాటులో వున్న సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పేదలందరికీ ఇళ్ళు నిర్మించే కార్యక్రమంలో ప్రతి లబ్దిదారుడు త్వరితంగా ఇంటి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాని సచివాలయ సిబ్బందిని జడ్పీ సిఇఓ ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో వున్న ఆర్‌బికె సెంటర్, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను పరిశీలించి త్వరితంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను జడ్పీ సిఇఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపకు భరోసా

65 కిలోమీటర్ల సాగిన మోహిత్ పాదయాత్ర

4లో

ఉష్ణోగ్రతలు
12/10/2022

- తిరుపతి 33 డిగ్రీలు
- చిత్తూరు 34 డిగ్రీలు
- మదనపల్లి 28 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 34 డిగ్రీలు
- వెంకటగిరి 34 డిగ్రీలు
- గూడూరు 34 డిగ్రీలు

బంగారం ధరలు
12/10/2022

22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,730
24క్యారెట్స్ 1గ్రాము రూ.5,160

కోడిగ్రుడ్డు ధరలు
12/10/2022

కోడిగ్రుడ్డు :రూ.6.00
1 డజను: రూ.72.00

కక్షగట్టి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారు

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి ఆవేదన

తిరుపతి, అక్టోబర్ 12 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీని వాసులు బుధవారం సాయంత్రం తిరుపతిలో మీడియా సమావేశంలో ఆద్యంతం వైకాపా ప్రభుత్వంలో ఇటీవల తనకు జరిగిన అవమానాన్ని, కక్షకుట్రపూరిత స్వార్థరాజకీయాలపై ఆవేదన చెందారు. తనకు కనీసం బెయిల్ కూడా రానీయకుండా వైకాపా ప్రభుత్వం, పోలీసు యం త్రాంగం తీరును ఆయన దుయ్యబట్టారు. 2019 ఎన్నికల తరువాత కుప్పం నియోజకవర్గంలో ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై, కార్యకలాపాలపై నోరుమెది పినందుకే తనపై కక్షగట్టి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని తన ఆవేదన వెళ్ళగక్కారు. ఎమ్మెల్సీ హోదాలో మూడు రాజధానులకు అనుకూలంగా మండలిలో ఓటేయమని తనను నయానా భయానా వైకాపా నేతలు బెదిరించారని, అయితే అప్పట్లో తమ నాయకుడు ఆదేశం శిరసా వహించి ఒకే రాజధానికి సానుకూల స్పందన తెలియజేయడం, నోరుతెరచి కుప్పం నియోజకవర్గంలో అక్రమాలను అడ్డుకోవడంతోనే తనతోబాటు ఇంకొందరు తెలుగుదేశం నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టారన్నారు. తమ పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి, కుప్పం ఎమ్మెల్యే నారాచంద్రబాబునాయుడు ఆగస్టులో కుప్పం పర్యటన సమయంలో ప్రభుత్వ అటవీభూముల్లో అక్రమమైనింగ్ కార్యకలాపాలు,లిక్కర్‌మాఫియా, వంటివాటిపై అడ్డుకోవడమే తనను ఇబ్బందికి గురిచేసి బెదిరిస్తున్నారని మధనపడ్డారు. తనపై వైసిపి ప్రభుత్వం, పోలీసులు తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపినా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, యువ నేత నారాలోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు, హైకోర్టు, జిల్లాకోర్టు సీనియర్ న్యాయవాదులు తనకు అండగా నిలబడ్డారన్నారు. మీడియా సమావేశంలో కూడా తిరుపతి ఇన్‌ఛార్జి సుగుణమ్మ,పార్లమెంట్ ఇన్‌చార్జి నరసింహయాదవ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్ర ఓటర్ల నమోదును ఓ యజ్ఞంలా చేపట్టాలి

ఎమ్మెల్యే బియ్యపు మధుసూధనరెడ్డి పిలుపు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 12 ప్రభాతవార్త
రాబోవు కీలక ఎన్నికల్లో పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నిక ఒకటని దీనికి సంబంధించిన పట్టభద్రుల ఓటర్ల నమోదును వైకాపా సైనికులు ఓ యజ్ఞంలా చేపట్టాలని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పిలుపు నిచ్చారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమాలు, అభ్యర్థికి సంబంధించిన పరిచయ సభను పార్టీ కార్యాలయంలో శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి అధ్యక్షతన జరిగింది.పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి శ్యాం ప్రసాద్‌రెడ్డిని సభకు పరిచయం చేసారు.శ్రీకాళహస్తిలో పార్టీకి నిరంతర శ్వాసగా పని చేస్తున్న ప్రజలు,పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తున్న పార్టీ నాయకులు,కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి పట్టభద్రులను గుర్తించి నమోదు చేయాలన్నారు.ఎంఎల్‌సి అభ్యర్థిని భారీ మెజారిటితో గెలిపించి తమ సత్తాను చాటాలని ఎంఎల్‌ఏ పిలుపు నిచ్చారు. 36 నియోజకవర్గాల్లో జరగనున్న ఎన్నికల్లో అత్యధికంగా పట్టభద్రుల ఓటర్ల నమోదు అత్యధికంగా చేర్పించి తిరుపతి నియోజకవర్గంలో ఎంఎల్‌సి అభ్యర్థికి అత్యధిక మెజారిటి సాధించి తామంటేఏమిటో తమ సత్తా ఏమిటో నిరూపించాలని పిలుపు నిచ్చారు.వచ్చేనెల 7 వరకు నమోదు కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించాలని కోరారు.గత కొన్ని సంవత్సరాలుగా కమ్యూనిస్టులే పట్టభద్రుల ఎంఎల్‌సిగా ఎన్నిక అవుతున్నారని ఈ సంప్రదాయాన్ని తిరగరాయాల్సి నది వైకాపా శ్రేణులే అని పిలుపు నిచ్చారు.వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఎన్నికల్లో ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించుకుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందించినపథకాలకు ప్రతిఫలం దక్కినట్లే అని తెలిపారు. నెల్లూరుజిల్లాలో పార్టీ కోసం ఆహర్నిశలు పని చేసిన అభ్యర్థి శ్యాం ప్రసాద్ అని గుర్తు చేసారు. అన్నిప్రాంతాలను సమన్వయంతో అభివృద్ధి పరచాలనే లక్ష్యంతోనే వికేంద్రీకరణ తీసుకొచ్చారని ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు.శ్యాం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 36 నియోజకవర్గాల పరిధిలోని పట్టభద్రుల తరఫున తనను అభ్యర్థిగా ముఖ్యమంత్రి ప్రకటించినందుకు ధన్యవాదాలని వివరించారు.ఓటర్ల నమోదులో ప్రతి ఒక్కరు ఫాం 18ని పూర్తి చేసి డిగ్రీ పూర్తి అయిన ఆధారాలను చూపాలని సూచించారు.దరఖాస్తుదారులూ ఆధార్ నెంబర్‌తో పాటు ఓటు ఐడి నెంబర్‌తోపాటు గెజిటెడ్ ఆఫీసర్ సంతకం తప్పని సరి అని గుర్తుచేసారు.

రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయండి

-జిల్లా కలెక్టర్ హరినారాయణన్

పలమనేరు,అక్టోబర్ 12,ప్రభాతవార్త:

నిర్దేశించిన కాలపరిమితిలో రీ సర్వేను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ సూచించారు.బుధవారం మండలంలోని మొరం గ్రామంలో గ్రౌండ్ ట్రూథింగ్ రీ సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు.అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మండలంలోని మొరం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియ గ్రామసరిహద్దులు,ప్రభుత్వ భూములు సరిహద్దులు పగడ్బందీగా చేపట్టాలని ఆధికారులను ఆదేశించారు.మొరం గ్రామంలో 2090 మంది రైతులు ఉండగా 2780 ఎకరాలలో గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియ జరగాల్సి ఉన్నదని, ఫారం9(2)నోటీసులు ఇవ్వాల్సి ఉన్నదని తహసీల్దార్ కలెక్టర్‌కు వివరించారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ డా.వెంకటేశ్వర్, కుప్పం ఆర్‌డిఓ శివయ్య,తహసీల్దార్ కుప్పుస్వామి,డిటి రుషివర్మ, ఆర్ఐ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

15న బేటరాయస్వామి కొండ వద్ద భారీ అన్నదానం

కుప్పంరూరల్, అక్టోబర్ 12 ప్రభాతవార్త

పెరటాసి నెల నాలుగవ శనివారం ఈసందర్భంగా ఈనెల 15న శ్రీ బేటరాయస్వామి కొండ వద్ద భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు చంద్రబాబు కార్యదర్శి మనోహర్ తెలిపారు. బుధవారం ఆలయం వద్ద అన్నదానం, వసతుల ఏర్పాట్లపై నేతలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి కార్యాలయ మేనేజర్ కాళప్ప నాయుడు, పూజారి ప్రతాప్ సింహా, మాజీ వైస్ సర్పంచ్ సుధీర్, మాజీ సర్పంచులు చౌడప్ప, వల్లెప్ప, రాష్ట్ర నేత శాంతారాం, తెలుగుయువత అధ్యక్షుడు మణి, నడిమూరు సర్పంచ్ జెకె సంతోష్, లక్ష్మీపతి, సంపత్, యశ్వంత్, బిసి సెల్ అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని చిన్నారి మృతి

కుప్పంరూరల్, అక్టోబర్ 12 ప్రభాతవార్త

తల్లితో పాటు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్న చిన్నారిని వేగంగా వచ్చిన టువీలర్ ఢీకొన్న సంఘటనలో చిన్నారి మృతి చెందింది. ఈసంఘటన మండలంలోని ఎర్రమన్నుగుంతలు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన సెల్వరాజ్ కుమార్తె ధార్మిక (4)ను ఆమె తల్లి మంగమ్మ బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో వేగంగా వచ్చిన టువీలర్ చిన్నారిని ఢీకొందన్నారు. దీంతో చిన్నారికి తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందింది. ఎర్రమన్నుగు ంతలు గ్రామానికి చెందిన వ్యక్తే టువీలర్‌లో చిన్నారిని ఢీకొన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

త్వరితంగా పదోన్నతుల కౌన్సెలింగ్

చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త:

ఇది వరకు నిలుపుదల చేసిన స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పదోన్నతుల పోస్టింగ్ కౌన్సెలింగ్‌ను త్వరితంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తంకు ఎస్టీయు నాయకులు కలిసి విన్నవించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం డిఇఓ శ్రీరామ్ పురుషోత్తంను చిత్తూరు జిల్లా ఎస్టీయు అధ్యక్షుడు దేవరాజులురెడ్డి, అన్నమయ్య జిల్లా ఎస్టీయు అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వీరు డిఇఓతో మాట్లాడుతూ పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించకపోవడంతో ఉపాధ్యాయులకు నష్టం వాటిల్లుతుందని సత్వరం పదోన్నతులు చేపట్టి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు లోకనాథరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, అమరనాథరెడ్డి, జగన్మోహన్, మధు, సుధీర్, శ్రీధర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో పంట కాలువ

పాలసముద్రం, అక్టోబర్ 12 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీ పరిధిలోని రాజుగుంట కోన చెరువు పంట కాలువ కబ్జాదారుల కోరల్లో చిక్కుకొంది. చెరువు నుండి పంట పొలాలకు నీరు ప్రవహించే పంట కాలువ కబ్జాకు గురికావడంతో పంట సాగుకు నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కబ్జాకు గురైన పంట కాలువను అక్రమణదారుల కబంద హస్తాల నుండి విముక్తి కల్పించి రైతులకు పంటలు సాగు చేయడానికి కాలువ ద్వారా నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కోరిన రైతులకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నుండి చుక్కెదురవుతుంది. వనదుర్గాపురం పంచాయతీ రాజుగుంట కోన చెరువు నుండి తమిళనాడు సరిహద్దు వరకు నీరు ప్రవహించడానికి సుదీర్ఘకాలం క్రితం పది అడుగుల పంట కాలువను నిర్మించారు. గతంలో ఈ కాలువ ద్వారా చెరువు నుండి సమృద్ధిగా నీటి ప్రవాహం సాగుతుండటంతో కాలువ పరిసరాల్లోని పంట పొలాల్లో రైతులు పంటలు సాగు చేసేవారు. నాలుగు సంవత్సరాల క్రితం చెరువు నుండి ఒక కిలోమీటరు దూరంలోని కొంతమంది రైతులు కాలువను ఆక్రమించుకొని పూడ్చి వేశారు. అప్పటి నుండి ఈ కాలువ ఆక్రమణకు గురికావడంతో చెరువు నుండి ఈ కాలువలో నీటి ప్రవాహం సాగడం లేదు. ఫలితంగా ఆక్రమణకు గురైన అవతలి వైపు వున్న రైతుల పంట పొలాల్లో పంటలు సాగు చేయడం సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువు కాలువను సర్వే నిర్వహించి ఆక్రమణకు గురైన కాలువను మళ్ళీ పునరుద్ధరించడానికి చర్యలు తీసుకొని తమ పంటల సాగుకు అవకాశం కల్పించాలని బాధిత రైతులు వేడుకొంటున్నారు.

తులసినాథంనాయుడుకు గార్లపాటి పురస్కారం

పలమనేరు,అక్టోబర్ 12,ప్రభాతవార్త:

తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపకులు తులసినాథంనాయుడు విశ్వసాహితీ సమాఖ్య(తిరుపతి)వారు గార్లపాటి పురస్కారాన్ని ప్రకటించారు.తెలుగు భాషా సాహిత్యాలకు చేస్తున్న కృషికి గుర్తింపుగా పురస్కారం అందిస్తున్నట్లు విశ్వసాహితీ సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గార్లపాటి దామోదర్‌నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు.ఈనెల 16న తిరుపతిలోని రాస్‌భవనంలో ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారంతోబాటు రూ.5వేలు నగదును అందంచనున్నట్లు తెలిపారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

ఎమ్మెల్సీ భరత్‌చే 6లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

కుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త

గుడుపల్లె మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ అనారోగ్యంతో బాధపడుతుండగా అతనికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద బుధవారం చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్‌ఆరులక్షలరూపాయల చెక్కును అందజేశారు. భాస్కర్‌ఆరోగ్యంగా త్వరగా కోలుకావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుడుపల్లె ఎంపిపి వరలక్ష్మి, జడ్పీటిసి కృష్ణమూర్తి, మండల కో కన్వీనర్ రామూర్తి, సర్పంచ్ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు ఎమ్మెల్సీ ఓటరు నమోదు వేగవంతం-

చిత్తూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమం వేగంగా చేపట్టి పూర్తి చేయాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని పిలుపునిచ్చారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు అధ్యక్షతన చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో వున్న ప్రాంతాల్లో బాదుడే బాదుడు కార్యక్రమంను పూర్తి చేయడానికి నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి పార్టీకి అనుకూలంగా మలచుకొనే కార్యక్రమాలను నాయకులు చేపట్టాలన్నారు. మాజీ మేయర్ కఠారి హేమలత మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత నెలకొందని ఇలాంటి పరిస్థితిని పార్టీ సద్వినియోగం చేసుకొని ప్రజల్లోకి వెళ్ళాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం పార్టీ కోసం అహర్నిశలు కష్టించి ప్రాణాలు వదలిన రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జహంగీర్‌ఖాన్‌కు తెలుగుదేశం నాయకులు సంతాపం తెలిపి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర కార్యదర్శ వెంకిటీల సురేంద్రకుమార్, రాష్ట్ర బిసీ సెల్ ప్రధాన కార్యదర్శి షణ్ముగం, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు శశికర్‌బాబు, ప్రధాన కార్యదర్శి రఘు, చిత్తూరు నగర పార్టీ ప్రధాన కార్యదర్శి దుర్గాచౌదరి, రాష్ట్ర మొదలియార్ కమిటీ కన్వీనర్ త్యాగరాజన్, రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి సిఎం విజయ, పార్లమెంటు క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు మేషక్, అధికార ప్రతినిధులు గోళ్ళ హేమాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ చెస్ కోచ్‌గా గోపికృష్ణ

చిత్తూరురూరల్, అక్టోబరు 12 ప్రభాతవార్త:

రాష్ట్రక్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఎన్.గోపికృష్ణను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ తిరుపతి నందు సీనియర్ చెస్ కోచ్‌గా నియమించినట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిఈవో మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు అలాగే సాయంత్రం 4గంటల నుంచి 9గంటల వరకు ఇవ్వనున్న కోచింగ్‌లో పాల్గొనడానికి బాలబాలలికలు, పురుష, స్త్రీలు నెలకు రూ.1000లను రాష్ట్రక్రీడాప్రాధికార సంస్థ అకౌంట్‌కు చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన చదరంగ క్రీడాకారులు కోచ్ దగ్గర శిక్షణ పొంది జాతీయస్థాయిలో పథకాలు సాధించాలని కోరారు. ఇతర వివరాలకు సెల్‌నెం.8500868964ను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

-పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు

ఐరాల, అక్టోబర్ 10 ప్రభాతవార్త:

పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. బుధవారం మండలంలోని ముదిగోళం గ్రామ సచివాలయ పరిధిలోని కురప్పల్లె, శివపురం, చింతగుంపలపల్లె తదితర గ్రామాలలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి పర్యటించారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించే విధంగా అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాదేవి, తహశీల్దార్ సుశీల, మండల వైకాపా కన్వీనర్ పట్నం బుజ్జిరెడ్డి, వైస్ ఎంపీపీ రోజా, ముదిగోళం సురేంద్రరెడ్డిలతో పాటు, సురేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవిప్రసాద్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఛైర్మన్ డా॥సుధీర్‌చే ఉచిత వైద్య శిబిరం

- 250మందికి ఉచితంగా పరీక్షలు..మందులు..మాత్రలు పంపిణీ

కుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ అధ్వర్యంలో శ్రీప్రియ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిచే ఉచిత వైద్య శిబిరంను నిర్వహించారు. ఈసందర్భంగా స్వయానా మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ ఆస్పత్రిలో సుమారు 250మందికి ఉచితంగా సిటి స్కాన్, ఇసిజి, ఇతర వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.

అనంతరం ఉచితంగానే మందులు, మా త్రలను పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ శ్రీమతి శ్రీప్రియ సుధీర్, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, ఎంపిపి కుమారి అశ్విని మురుగేష్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, కౌన్సిలర్లు గణపతి, విజయ్, నేతలు రాజా, శేఖర్, కొటాపూరు కన్నన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

సూళ్లూరుపేట,కోట,వెంకటగిరి ,బాలాయపల్లి దొరవారిసత్రం,

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించండి

- ఏబీవీపీ నాయకుల డిమాండ్

సూళ్లూరుపేట, అక్టోబర్ 12 ప్రభాతవార్త

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ సూళ్లూరుపేట శాఖ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సన్నీ, నగర కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహాలలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, కనీస మౌలిక వసతులు లేక ఎంతోమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా ఇష్టం వచ్చిన ఆహారం పెడుతున్నారని విమర్శించారు. అలాగే సూళ్లూరుపేట మండలంలో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్ ముందున్న మద్యం దుకాణం వల్ల విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. తక్షణమే మద్యం దుకాణాన్ని తొలగించాలన్నారు. నగర సంయుక్త కార్యదర్శి శోభ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలను ఇప్పటివరకు విద్యార్థులకు పెంచకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నగర మహిళా కన్వీనర్ ఉష, భవ్య, నగర సంయుక్త కార్యదర్శి లోకేష్, క్రాంతి, మహేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన సేవలు

కోట, అక్టోబర్ 12 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని కోట మండలం చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ విడతల వారీగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సిబ్బందికి శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఈ విధానంలో ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యాధికారులను నియమిస్తారని, ప్రతి సచివాలయం పరిధిలో నెలకు రెండుసార్లు ఆరోగ్య సంచార యూనిట్ ద్వారా వైద్యాధికారి సందర్శిస్తారని తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. మధ్యాహ్నం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలు పొంది ఇంటికి వచ్చి వారిని పరీక్షిస్తారని తెలిపారు. ఈ విధానంలో 65 రకాల మందులు, 14 రకాల డయాగ్నస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

కోట ప్రభుత్వాసుపత్రిలో తగ్గుతున్న ఓపీ

కోట, అక్టోబర్ 12 ప్రభాతవార్త

కోట ప్రభుత్వాసుపత్రిలో ఓపీల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. కోటలోని 30 పడకల ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన సేవలు అందిస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్‌రావును ఇటీవల గూడూరుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో అనస్తిషియా డాక్టర్‌ను నియమించారు. ఎందుకో ఆసుపత్రికి వైద్యసేవలు పొందడానికి ప్రజలు ముందుకు రావడం లేదు. గతంలో ఉన్న మధుసూదన్‌రావు ఈ ఆసుపత్రిలో అధునాతనమైన పరికరాలను సైతం సమకూర్చారు. దీంతో కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల నుంచి వివిధ పనులపై కోటకు వచ్చిన ప్రజలు పనిలో పనిగా కోట ఆసుపత్రికి వచ్చివైద్యంచేయించుకొని వెళ్లేవారు. ప్రస్తుతం ఓపీ శాతం పూర్తిగా పడిపోయిందని తెలుస్తోంది. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు ఈ ఆసుపత్రిపై మరింత దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కోటలో ఆక్రమణలు తొలగించండి

కోట, అక్టోబర్ 12 ప్రభాతవార్త

కోటలో రోజురోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎదురెదురుగా వాహనాలు వస్తే గంటలకొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కోట పట్టణంలో ఆక్రమణలను తొలగించాలని అనేక సంవత్సరాల నుంచి ప్రజలు జిల్లా అధికారులను కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇది తమ ఒక్కరి బాధ్యతే కాదని, రెవెన్యూ అధికారులు సహకరించాలని కోరుతున్నారు. సర్వేయర్ గతంలో పలుసార్లు సర్వే చేసి మార్కింగ్ ఇచ్చి కూడా వదిలేశారు. ఎందుకో అధికారులు ఆక్రమణల మాట మరిచిపోయారని ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఆక్రమణదారుల వెనుక రాజకీయ నాయకుల హస్తం ఉందని ప్రచారం సైతం లేకపోలేదు. రోజురోజుకు పెరుగుతున్న జనాభా దృష్ట్యా ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఇకనైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కోటలో ఆక్రమణలు తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

నాయుడుపేట రూరల్, అక్టోబరు 12 ప్రభాతవార్త

నాయుడుపేట మండలం పండ్లూరు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.గూడూరుకు చెందిన ఉదయ్, కిషోర్‌కుమార్‌లు మోటార్‌సైకిల్‌పై సూళ్ళూరుపేటకు వచ్చి పనిపూర్తిచేసుకొని తిరిగి గూడూరుకు వెళుతుండగా మార్గమధ్యలో నాయుడుపేట మండలం పండ్లూరు వద్దకు వచ్చేసరికి ముందుగా వెళ్ళుతున్న లారీని క్రాస్‌చేయబోయి ప్రమాదవశాత్తు మోటర్‌సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది.దీంతో ఉదయ్, కిషోర్ కుమార్‌లుతీవ్రంగాగాయపడ్డారు.అటువైపుగావెళుతున్నప్రయాణికులుగుర్తించి108సహాయంతోచికిత్స నిమిత్తంనాయుడుపేటప్రభుత్వవైద్యశాలకునాయుడుపేటపోలీసులుకేసునమోదుచేసిదర్యాప్తుచేస్తున్నారు.

అన్ని వర్గాలకు ప్రయోజనకర పథకాలు

కోట, అక్టోబరు 12 ప్రభాతవార్త

ఉత్తరాల బట్వాడా నుంచి మొదలైన భారత తపాలా శాఖ సేవలు విభిన్నమైన సేవలను ప్రజల ముంగిటకు తీసుకొని రావడం జరిగిందని, అన్ని వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ప్రయోజనం కల్పించేలా పోస్టాపీసుల్లో అనేక రకాలైన పథకాలు ప్రవేశ పెడుతోందని పోస్టామాస్టర్ షెక్.నిజాముద్దీన్ చెప్పారు. తపాల వారోత్సవాల భాగంగా బుధవారం ఆయన మాట్లాడుతూ నామమాత్రం రుసంతో బీమా పథకాలు, పిల్లల భవిష్యత్తులో ఉపయోగపడేలా సుకన్య సమృద్ధి యోజన, ప్రజా భవిష్యనిధి, తదితర పథకాలు ఏన్నో ఉన్నాయన్నారు. ఏదైనా ప్రమాదం సంభవినప్పుడు దివ్యాంగులుగా మారినా, మృత్యువాత పడినా ఆ కుటుంబం రోడ్డున పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రీమియంతో వారి కుటుంబాలకు అండగా నిలిచేలా ప్రమాద బీమాతో పాటు వివిధ రకాల పథకాలను అందుబాటులో ఉన్నాయన్నారు. కేవలం రూ 300ప్రీమియంతో ప్రమాద బీమా పాలసీ తీసుకుంటే ప్రమాదంలో మృతి చెందినా, శాశ్వత వైకల్యం ఏర్పడినా, పక్షవాతం లాంటి వ్యాధులు వైకల్యం ఏర్పడినా రూ 10 లక్షలు చెల్లిస్తారని ఆయన పేర్కొన్నారు. ఒక వేళ ఆస్పత్రిలో చేరితే వైద్య ఖర్చులు కోసం రూ 60వేలు,ఔట్ పేషంట్‌గా చిక్సిత పొందితే రూ.30 వేలు, ఆస్పత్రికి రవాణా ఖర్చుల కింద రూ. 25 వేలు ఇస్తారని తెలిపారు.

ఆల్‌ఇండియా ఓపెన్‌ఫైడ్ రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్

చిత్తూరురూరల్, అక్టోబరు 12 ప్రభాతవార్త:

ఈనెల 29, 30 తేదిలలో తిరుపతిలో శ్రీనివాస స్పోర్ట్ కాంప్లెక్స్, శాప్ ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అఖిల భారత ఓపెన్ ఫైడ్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు సెట్విన్, డియస్ఏ ముఖ్యకార్యనిర్వహణాధికారి వి.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.5 లక్షలతో అండర్ 7,9,11,13,15 తరగతుల బాలబాలలికలకు నగదు బహుమతులు ప్రదానం వుందన్నారు. ఈ టోర్నమెంట్ నందు పాల్గొనడానికి వెబ్‌సైట్ www.apchess.org ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 7799030719లను సంప్రదించాలని కోరారు.

లోన్‌యాప్‌ల వల్ల కలిగే నష్టాలపై అవగాహన

చిల్లకూరు అక్టోబర్ 12 ప్రభాతవార్త

చిల్లకూరు ఎస్ఐ బి గోపాల్ బుధవారం జిల్లా ఎస్పి పరమేశ్వ రరెడ్డి ఆదేశల మేరకు చిల్లకూరు పోలీ స్‌స్టేషన్‌వద్ద వరగలి క్రాస్‌రోడ్డు వద్ద,కోట క్రాస్ రోడ్డు వద్ద సిబ్బందితో కలిసి ప్రస్తుత పరిస్థితులలో సైబర్ నేరాలలో భాగంగా నకిలీ లోన్ యాప్‌ల వల్ల కలిగే ఇబ్బందులగురించి ఆటోడ్రైవర్లకు,ద్విచక్రవా హనదారు లకు అవగాహన కల్పించారు.అనంతరం వారు మాట్లాడుతు ప్రజలు నేరాల బారిన పడకుండా ఉండేందుకుతగినజాగ్రత్తలుతీసుకోవాలనిఅన్నారు.అనంతరంఆటోలకిలోన్‌యాప్‌లవల్లనష్టాలగురించి ముద్రించికరపత్రాలను ఆటోలకు కూడలిలో అతికించడం జరిగింది. కరపత్రాలు ప్రజలకు పంపిణి చేశారు.

దీపావళి ముందు పల్లెల్లో చీకటే చీకటి

తడ, అక్టోబర్ 12 ప్రభాతవార్త

దీపావళి అమావాస్య రోజుల ముందు పల్లెల్లో చీకట్లు అలముకుంటున్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో అన్ని రోజుల కన్నా దీపావళి అమావాస్య రోజులు చిమ్మచీకటిగా ఉంటాయి. ఈ సారి మరీ ఈ చీకట్లు ముసురుకుంటున్నాయి. వర్షపు జల్లులు, కింద చిత్తడి నేల, పైన చిమ్మచీకటి పల్లెలను చుట్టుముడుతోంది. ఇటీవల గడప గడపకు అంటూ తిరుగుతున్న పాలకులు సైతం పల్లెల అవస్థలను గమనించారు. పలుచోట్ల లైట్ల గురించి ఫిర్యాదు చేశారు. మరికొన్ని గ్రామాల్లో ఫిర్యాదులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. విద్యుత్ సరఫరాలో కొన్ని మారుమూల ప్రాంతాలకు ఇబ్బందులు తప్పడం లేదు. అక్కడ చినుకు పడితే ఇక్కడ లైట్లు ఆరిపోతున్నాయి. తడ మండలం వాటంబేడు తదితర గ్రామాల్లో అయితే విద్యుత్ కోత సమస్య తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతంలో ఒక సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్న కోరిక కలగానే మారింది. దీనికితోడు వాటంబేడు, గోపాల్‌రెడ్డిపాలెం తదితర గ్రామాల్లో వీధిలైట్ల సమస్య తీవ్రంగా ఉంది. పంచాయతీల వారు నిధుల లేమి సాకు చూపుతున్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది కూడా చేతులెత్తేస్తున్నారు. ఈ రెండింటికీ మధ్య సమన్వయం అంతంత కావడం, ఒకరి మీద ఒకరు చెప్పుకోవడంతో ఈ చీకటి రాజ్యం కొనసాగుతోంది. మండల స్థాయి అధికారులు పల్లెల వైపు కన్నెత్తి చూడకపోవడంతో సమస్యలు మరింత ముదురుతున్నాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకముందే వీధిలైట్లను ఏర్పాటు చేయడం, విద్యుత్ కొరత సమస్యను పరిష్కరించడం ఎంతైనా మేలవుతుందని పల్లె ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రదర్శనకు కాదు...ప్రజల బాగోగుల విచారణకు

పుంగనూరు, అక్టోబరు 12 ప్రభాతవార్త :

పట్టణంలో నిరంతరాయంగా సాగుతున్న గడపగడపకూ వైకాపా కార్యక్రమం ఆద్యంతమూ ఆసక్తి రేపుతోంది. ప్రజలవద్దకు వెళ్ళి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసేందుకు సిఎం సూచించిన ప్రత

పథకాలు ప్రజలకు చేరవేయడానికే గడప గడపకు మన ప్రభుత్వం

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 12, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తిరుపతి 10వ డివిజన్ టిఎంఆర్ కళ్యాణ మండపం వద్ద నుంచి కొర్లగుంటలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి లక్ష్యాల గురించి ప్రజలకు వివరించారు. జగనన్న ప్రకటించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఊహలకు అందని స్థాయిలో ప్రజా స్పందన లభిస్తోందన్నారు. ప్రజలు మా కోసం పని చేస్తున్న జగనన్న రుణం తీర్చుకుంటామని చెబుతున్నారని తెలిపారు. 87 శాతం గృహాలకు జగనన్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూర్చి నందు వల్లే మేం ఎమ్మెల్యేలుగా ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లగలుగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రతాప్ రెడ్డి, దొడ్డారెడ్డి ప్రణాళిక, రామస్వామి వెంకటేశ్వర్లు, కుమారి, వైసిపి నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, శంకర్ రెడ్డి, పోలిరెడ్డి నాగిరెడ్డి, నాథముని, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, శ్రీదేవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన శివభక్తులు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం భక్తుల తాకిడి స్వల్పంగా తగ్గింది.తిరుమల కొండపై రద్దీ అధికంగా ఉన్నా శ్రీకాళహస్తీశ్వరాలయంలో రద్దీ కొద్దిగా తగ్గింది. అయితే కొండ దిగిన జనం అయితే ఇక్కడకు వస్తున్నారు.సాధారణంగా బుధ,గురువారాల్లో ఏ మాత్రం రద్దీ ఉండదు.అలాంటిది ఈ బుదవారం సుమారు 16వేల మంది స్వామి అమ్మవార్లను దర్శించుకొని పూజలు జరుపుకున్నారు.భక్తుల రద్దీ పరిమితంగా ఉండటంతో దర్శనానికి వచ్చిన భక్తులకు సుదర్శనం, సత్వర దర్శనం అవకాశం కల్గింది.దళారులున్నా భక్తులకు ఇబ్బంది కల్గలేదు.

రాహుకేతుదోష నివారణ పూజలు: శ్రీకాళహస్తీశ్వరాలయానికి బుధవారం రూ.200 దర్శనం టిక్కెట్లుతో 332 మంది, రూ.50ల దర్శనం టిక్కెట్టులో 617 మంది రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి రూ.500లు టిక్కెట్లు 1113 మంది, రూ.750టిక్కెట్లతో 339, రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన 80 మంది భక్తులు రూ.2500ల టిక్కెట్లు కొనుగోలు చేసి 84 మంది, రూ.5వేల టిక్కెట్లు 29 కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్నారు. కాగా అభిషేకాలు 40 శనీశ్వరాభిషేకాలు 7,మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 13 జరిగినట్లు సమాచారం అందించారు.

కార్మికులు సంక్షేమానికి కృషిచేస్తాం..అంజూరు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 12 ప్రభాతవార్త

ఆర్టీసి కార్మికుల సంక్షేమానికి కృషిచేస్తామని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు అంజూరుతారక శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశం పురుషోత్తం ఆచారి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా అంజూరుతారకశ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ఎన్నడూ ముందుంటానన్నారు. జిల్లా అధ్యక్షులు డి.గురునాథం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేసి కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని వివరించారు. జిల్లా కార్యదర్శి టి.సత్యనారాయణ మాట్లాడుతూ తొలగించిన నెల్లూరు సర్వీసులను పునరుద్దరించే విధంగా ఓటి డ్యూటీలు రద్దు చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ నాయకులు ఎన్‌విఎస్.బాబు, జిల్లా నాయకులు కెసి.రెడ్డి, పి.నరసింహులు, డిపో నాయకులు ప్రసాద్, రోశయ్య, సునీల్, ఉదయ్, చంద్ర, సిసిఎస్ డెలిగేట్ సభ్యులు హాజరయ్యారు. అనంతరం గౌరవాధ్యక్షులను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

14 నుంచి భగవద్గీత ప్రవచనాలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 12 ప్రభాతవార్త

శ్రీమద్భగవద్గీత ఆరో అధ్యాయంపై ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మగుడి కళ్యాణమండపంలో ప్రవచనాలు ఉంటాయని శుకబ్రహ్మాశ్రమ భక్తులు తెలిపారు. ట్రస్టుబోర్డు సహకారంతో నిర్వహించే సాయంత్రం 6 నుంచి 7.30గంటల వరకు ఉంటుందని ఉపన్యాసకులుగా శుకబ్రహ్మాశ్రమ ఉత్తర పీఠాధిపతులు పూజ్యశ్రీ సంపూర్ణానందగిరిస్వామి హాజరవుతారన్నారు.

పొయ్య పాఠశాలకు ఎల్ఈడి టివి వితరణ

.తొట్టంబేడు, అక్టోబర్ 12 ప్రభాతవార్త

మండలంలోని పొయ్య ప్రాథమిక పాఠశాలకు పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కుటుంబంలో ఒక్కొక్క విద్యార్థి వెయ్యిరూపాయలు అందించగా, కాకినాడ వాస్తవ్యులు ప్రస్తుత ఎన్ఆర్ఐ కంచెర్లసత్యనారాయణ అందించిన రూ.3వేల విరాళంతో పాఠశాలకు టివిని కొనుగోలు చేశారు. ఈసందర్భంగా బుధవారం దీన్ని ఎంపిపి ఉన్నంనిర్మలవాసుదేవనాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ నేటి కంప్యూటర్ ప్రపంచంలో విద్యార్థులు డిటిటల్ పాఠ్యాంశాలు సులభతరంగా నేర్చుకునేందుకు వీలుగా ఎల్ఈడి టివిని విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం, ఎన్ఆర్ఐ సహకారంతో ఏర్పాటు చేసుకోవడం ఎంతో అభినందనీయం అన్నారు. విద్యార్థులకు చిన్నసింగమాల ప్రధానోపాధ్యాయురాలు బి.శిరీష పెన్నులు, పెన్సిళ్ళు ఇతర విద్యాసామగ్రిని వితరణగా అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసి కమిటీ చైర్మన్ కె.ఆనంద్, మాజీ సర్పంచ్ ఉన్నం.కృష్ణమనాయుడు, ఎస్ఎంసి వైస్ చైర్మన్ సుభాషిణి, పెద్దకన్నలి ప్రధానోపాధ్యాయురాలు జి.శ్రీనివాసులు, కల్లిపూడి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సుబ్రమణ్యం, మల్లిగుంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, చిన్నసింగమాల ప్రధానోపాధ్యాయురాలు శిరీష, రౌతుసూరమాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.హేమాంబరదరరావు, లింగమనాడుపల్లి ప్రధానోపాధ్యాయులు కె.రాంబాబు, పెద్దకన్నలి సిఆర్పి మంజుల, పొయ్య పాఠశాల ఉపాధ్యాయులు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

శ్రీకాళహస్తి, అక్టోబర్ 12 ప్రభాతవార్త

తిరుపతిలోని శ్రీదత్త టెన్నిస్ అకాడమీ దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర ఓపెన్ మినీ అండ్ జూనియర్స్ టెన్నిస్ టోర్నమెంట్-2022 పోటీల్లో ఎంజిఎం జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్.విధిత(సీనియర్ సిఈసి) అండర్-18 పోటీల్లో విజేతగా నిలచింది. ఈసందర్భంగా విద్యార్థినిని ఎంజిఎం కళాశాల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మరియు ప్రిన్సిపల్ విఎస్.రత్నంలు పుష్పగుచ్చంను అందించి అభినందించారు.

జేఏసి ఆధ్వర్యంలో ఎల్ఐసి ఏజెంట్ల ధర్నా

శ్రీకాళహస్తి, అక్టోబర్ 12 ప్రభాతవార్త

కేంద్ర జాయింట్ యాక్షన్ కమిటీ ఆదేశాల మేరకు దేశంలోని అన్ని ఎల్ఐసి బ్రాంచి కార్యాలయాల్లో గత నెల సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అంచెలంచెలుగా జెఏసి ఆధ్వర్యంలో ఏజెంట్లు ధర్నాలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో బుధవారం శ్రీకాళహస్తి ఎల్ఐసి బ్రాంచి కార్యాయలంలో ధర్నాను నిర్వహించారు. పాలసీదార్లు మరియు ఏజెంట్ల యొక్క న్యాయపరమైన డిమాండ్లను పాలసీలకు ఇచ్చే బోనస్‌రేట్లు పెంచడం, పాలసీలపై విధించే జిఎస్టీని రద్దుచేయడం, పాలసీలపై ఇచ్చే రుణాల వడ్డీ రేట్లు తగ్గించడం, ఏజెంట్లకు గ్రూప్ ఇన్‌సూరెన్స్ స్థాయి రూ.25లక్షలు వరకు పెంచడం, ఏజెంట్లు అందరికీ మెడిక్లైంలను వర్తింపచేయాలని, జాతీయ స్థాయిలో ఏజెంట్లకు రూ.100కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని స్థానిక ఎల్ఐసి ఏజెంట్లు అందరు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక జయరాంరావువీధిలోని కార్యాలయం వద్ద శాంతియుతంగా ధర్నా నిర్వహించారు.తమ డిమాండ్లు సాధించే వరకు వినూత్నమైన రీతిలో ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేయడం జరుగుతుందని బ్రాంచ్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు తెలిపారు. సమావేశంలో జెఏసి నాయకులు సన్నారెడ్డి నారాయణరెడ్డి, మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, శ్రీమన్నారాయణ, సతీష్, రాధాకృష్ణయ్య, బాబురావు, గోవిందరెడ్డి, మస్తానయ్య, రామచంద్రారెడ్డి, చిట్టి, హరిబాబు, సుధాకర్‌నాయుడు, రామచంద్రయ్య, పద్మనాభయ్య, చెంగయ్య, శివప్రసాద్, సుబ్బారావు, మురళీ, ఈశ్వర్, వెంకయ్య, మునిరాజ, సునీల, రమణమ్మ, మీన, నీరజ, భాస్కర్, అర్జున్, సుబ్రమణ్యం, హేమకుమార్, వాణి, మునిరత్నంరెడ్డి, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను యధావిధిగా కొనసాగించండి

టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి

రామచంద్రాపురం, అక్టోబర్ 12 ప్రభాతవార్త:

ఎన్నికల పోలింగ్ కేంద్రాలను యధావిధిగా కొనసాగించాలని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. బుధవారం రామచంద్రాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలలో లబ్దిపొందడం కోసం అధికార పార్టీ నాయకులు పోలింగ్ కేంద్రాలను మార్పు చేస్తున్నట్లు ఆరోపించారు. ఓటర్లకు అందుబాటులో లేకుండా కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం తగదన్నారు. 2019 ఎన్నికలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను యధావిధిగా కొనసాగించాలన్నారు. మండలంలో 8 పోలింగ్ కేంద్రాలను మార్చడం ఎంత వరకు సమంజమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చినబాబు, జనార్ధన్ చౌదరి, కోరా హరిప్రసాద్, ఉమాపతి నాయుడు, ధనంజ రెడ్డి, రావిళ్ళ గిరి, కోటీశ్వర్ రెడి , తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

- మజ్దూర్ యూనియన్ డిమాండ్

రేణిగుంట, అక్టోబరు 12 ప్రభాతవార్త:

ఆలిండియా రైల్వే మెంబరు ఫెడరేషన్ పిలుపు మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రేణిగుంట సీఆర్ఎస్ మెయిన్ గేటు వద్ద బుధవారం కార్మికులు నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా సీఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ బ్రాంచి సెక్రటరీ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రైల్వేల ప్రైవేటీకరణను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. దీక్షలో మజ్దూర్ యూనియన్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి, చైర్మన్ బాబు, ఆఫీస్ బేరర్స్ సదాశివరెడ్డి, ఉదయ్‌రాయ్, హెన్రీపాల్, చంద్రశేఖర్, ముని, రాధా, చంద్రనాయక్, మణి మారన్,రేణిగుంటసీపీఎంనాయకులు వెంకటరమణ, సీసీఎస్ డైరెక్టర్లు నరేంద్ర, ధనంజయ్ పాల్గొన్నారు.

మహానుభావుల కృషితోనే విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్లు

పుత్తూరురూరల్, అక్టోబరు 12 ప్రభాతవార్త:

జస్టిస్ చంద్రచూడ్, నకారా లాంటి మహానుభావుల కృషి ఫలితంగా పెన్షన్లు పొందుతూ కోట్లాది మంది సంతోషంగా ఉంటున్నామని జిల్లా పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి గురు రాజారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ పెన్షనర్ భవనంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నాయకత్వం భరోసా వల్లనే సంఘం బలపడుతుందన్నారు. అనంతరం కీర్తిశేషులు విద్వాన్ గుత్తా మునిరత్నంనాయుడు, పుష్పవల్లీకి శ్రద్ధాంజలి ఘటించారు. సమావేశంలో సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షులు చెంగారెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షులు శంకర్, ప్రధాన కార్యదర్శి జయరాంనాయుడు, కోశాధికారి సిద్ధయ్య, తిరుపతి పట్టణ అధ్యక్షులు వెంకటేశంశెట్టి, జిడ్డు కృష్ణమూర్తి, సులేమాన్, భాస్కర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రాజు, రవిశంకర్, రామచంద్రరాజు, రామలింగం, మార్టిన్,చంద్రశేఖర్‌వర్మ,వెంకటకృష్ణ, మురళి, రామమూర్తి, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

- దాసరి జనార్ధన్ పిలుపు

బీఎన్ కండ్రిగ, అక్టోబరు 12 ప్రభాతవార్త:

తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న విద్యా వేత్త యూటీఎఫ్‌రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరు లురెడ్డిని గెలిపించాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్ధన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన బుచ్చినాయుడు కండ్రిగలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశం లోపాల్గొన్న దాసరి జనార్ధన్ మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పట్ల ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యల పట్ల పని చేస్తున్న మీగడ వెంకటేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని నియో జకవర్గంలోని గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలకు ప్రజా సంఘాలు కూడా మద్దతిస్తున్నట్లు సందర్భంగా గుర్తు చేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ధనం జయలు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల గురవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వడం గొప్ప విషయం!

-హర్షం వ్యక్తం చేసిన మంత్రి మేరుగ నాగార్జున

తిరుపతి ప్రెస్‌క్లబ్,అక్టోబర్ 12 ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చర్చి పాస్టర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వడం గొప్ప విషయమని సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డా॥మేరుగ నాగార్జున అన్నారు.బుధవారం నడప నగరం లోని ఎన్టీఆర్ నగర్ ఆర్ట్స్ కాలేజీ సమీపంలోని ఐఎఫ్‌సిఎంసి ఆవరణలో ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ జేఏసి చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో కడప జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రి నాగార్జున,డిప్యూటీ సిఎం అంజాద్ బాషా విచ్చేశారు. వారు మాట్లాడుతూ పాస్టర్లకు గౌరవ వేతనం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పట్ల తమ హర్షం వ్యక్తం చేశారు.అనంతరం డా॥యలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ అనేక సం॥లుగా వేధిస్తున్న సమస్య దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వకపోవడం అన్నారు.అలాగే రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులకు బరియల్ గ్రౌండ్ అనేది పెద్ద సమస్యగా మారిందన్నారు. ప్రభుత్వ ధరకు కొనుగోలు చేయడానికి తాము సిద్ధమ న్నారు.దీనికి స్పందించిన మంత్రి నాగార్జున..తప్పకుండా ఈ 4 సమస్యలను సిఎం దృష్టికి తీ సుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిషప్స్ కౌన్సిల్ అధ్యక్షుడు దిశ బాలరాజు,ప్రధాన కార్యదర్శి బిషప్ విట్టర్‌పాల్,ఉపాధ్యక్షుడు డేవిడ్ మనోహర్, సహ కార్యదర్శి విషం మోజస్,కడప జిల్లా అధ్యక్షుడు నిశ్శబ్దాని కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్మాత్మిక చింతనతో మానవమనుగడలో మార్పు

శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 12 ప్రభాతవార్త

ఆధ్యాత్మిక చింతనతో మానవ మనుగడలో మార్పు వస్తుందని శ్రీకాళహస్తీశ్వరాలలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు.బుధవారం మండలంలోని అక్కూర్తి పొలిమేరల్లో వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న తల్లి నవఖండయోగి మూటల లక్ష్మమ్మ ఆలయంలో ఆరాధనోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసారు.ఆయనకు ఆలయ మర్యాదలతో నిర్వాహకులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ నేడు శ్రీకాళహస్తి శైవ క్షేత్రంలో వాడ వాడల్లో ధార్మికత వెల్లి విరుస్తుందన్నారు. ఇక్కడ మూటాలమ్మ అలయాభివృద్ధికి పట్టణానికి చెందిన ఓ వ్యాపారి నడుంబిగించి అభివృద్ధి పథంలో నడిపి నేడు చక్కటి ఆలయాన్ని నిర్మించారని ఇక్కడ ఆశ్రమం ఎంతోమంది పేదలకు నీడ నిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస్ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులును సత్కరించారు. కండువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు.ఆశ్రమంలో మూటాలమ్మ జీవసమాధి అయిన చోట నిర్మించిన సమాధి వద్ద చైర్మెన్ పూజలు జరిపారు.ఈ కార్యక్రమాల్లో పూజారి శ్రీనివాసులురెడ్డి,గ్రామస్తులు శంకర్,రాజ, గురవయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు. చైర్మెన్‌తో పాటు ఆయనఅనుచరులు నరసింహ,బాలగౌడ్‌లు పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

టిడిపికి ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది

గాలి భానుప్రకాష్

పుత్తూరు, అక్టోబరు 12 ప్రభాతవార్త :

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాల పట్ల ప్రజలు విసుగు చెందడం వల్ల నానాటికీ తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ అన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రజలపై ఇంటి పన్ను, చెత్త పన్ను, కరెంట్, ఆర్టీసి బస్సు ఛార్జీల పెంపుతో ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపిందని తెలిపారు. బుధవారం మునిసిపాలిటీ పరిధిలోని చినరాజుకుప్పం, బత్తలవారి కండ్రిగ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన చినరాజుకుప్పంలో ఇటీవల మృతి చెందిన బోయపాటి గిరిజమ్మ కర్మక్రియల్లో పాల్గొన్నారు. బత్తలవారి కండ్రిగలో మృతి చెందిన మౌనిక మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణఅధ్యక్షుడుగాలిజీవరత్నంనాయుడు,ప్రధాన కార్యదర్శి ధనపాల్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆనంద్,ఇంకానాయకులు ప్రసాద్‌నాయుడు, హరి, చెంచయ్య, జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల వైకాపా బిసిసెల్ అధ్యక్షులుగా శివకుమార్ నియామకం

నారాయణవనం, అక్టోబర్ 12 ప్రభాతవార్త :

నారాయణవనం మండలం బిసి సెల్ కమిటీ అధ్యక్షులుగా గాండ్ల కె శివకుమార్‌ని నియమించారు. ఈ సందర్భంగా ఆయన్ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, జడ్పీ ఫైనాన్సియల్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ బుధవారం సత్కరించారు. పార్టీ, ప్రజలకు సేవ చేస్తున్న శివ కుమార్‌నుగుర్తించిమండలబిసిసెల్‌కమిటీఅధ్యక్షులుగా నియ మించడం పట్ల అభినందనలు తెలిపారు. అనంతరం దుశ్శాలువతో సత్కరించారు. అంకిత భావం తో పనిచేసిఎమ్మెల్యేకు,జడ్పీఫైనాన్సియల్ కమిటీ మెంబర్‌కి వన్నే తెస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంను సద్వినియోగం చేసుకోవాలి

సెట్విన్ సిఇఓ డా. మురళీకృష్ణ

తిరుపతి(విద్య), అక్టోబర్ 10, ప్రభాతవార్త

ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా 2022 - 23లో జాతీయ ప్రైవేటు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం పొందుటకు పరిశ్రమలు, సేవా రంగ సంస్థలు నెలకొల్పె ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, అభ్యర్థుల తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా వెబ్ సైట్ నందు తమ పూర్తి వివరములతో నమోదు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ వారు తెలుయజేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఉత్పత్తి రంగంలో రూ. 50 లక్షలు సేవా రంగంలో రూ. 20 లక్షలు ప్రాజెక్టు వ్యయం కల్గిన యూనిట్లను స్థాపించుటకు 15 శాతం, 35 శాతం రాయితిని పొందవచ్చునన్నారు. దరఖాస్తు చేయడానికి అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాలు నిండి ఉండాలని ప్రాజెక్టు వ్యయం తయారి రంగంలో రూ. 10 లక్షలు సేవా రంగంలో రూ. 5 లక్షలు వరకు తప్పనిసరిగా 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని అంతకు మించి తయారి రంగంలో రూ. 50 లక్షలు సేవారంగంలో రూ. 20 లక్షలు ప్రాజెక్టు వ్యయము వున్నట్లయితే 8వ తరగతి లేదా 6వ తరగతి కూడా పాస్ అయి ఉండవచ్చున్నారు. ఈ పథకం నందు లబ్ధి పొందుటకు తప్పని సరిగా ప్రాజెక్టు వ్యయము నందు 95 శాతం ఏదైనా బ్యాంకు వారు మంజూరు పత్రము సమర్పించాల్సి వుంటుందని, 5 శాతం తమ వంతు వాటాగా చెల్లించినట్లయితే అర్బన్ ప్రాంతము వారికి 25 శాతం, రూరల్ పాంతం వారికి 35 శాతం ప్రభుత్వం నుంచి సబ్సిడి పొందవచ్చునన్నారు.

సమస్యల పట్ల యువత స్పందించాలి

తిరుపతి (విద్య), అక్టోబర్ 10, ప్రభాతవార్త

రెగాలియా హోటల్‌లో జరిగిన జెసిఐ తిరుపతి ఒడిస్సీ గ్రేట్ డే సెలెబ్రేషన్స్‌కి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. ఆశాలత మాట్లాడుతూ సమాజంలోని సమస్యల పట్ల యువత స్పందించాలని చెప్పారు. అలాగే మరో విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆశాలత హస్పిటల్స్ వ్యవస్థాపకులు డా.కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గవర్మెంట్ ఒక్కటే సమాజంలోని సమస్యలని తీర్చలేదు. ఇలాంటి వాలంటరీ సంస్థలు, ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన జెసిఐ ఇండియా పౌండేషన్ బోర్డు డైరెక్టర్ ఎన్‌బి హర్షవర్ధన్ రెడ్డి ప్రపంచ వ్యాప్తంగా జెసిఐ చేస్తున్న ఎన్నో సేవాకార్యక్రమాలు గురించి చెప్తూ యువతని ఉత్సాహవంత పౌరులుగా మారాలని పిలుపునిచ్చారు. ముఖ్య ఉపన్యాసకులుగా విచ్చేసిన జి. ఎల్ మనోహర్ మాట్లాడుతూ జెసిఐ ఒక వ్యక్తిని శక్తిగా చేసి వారి సామర్థ్యాలని పెంచుతుందని చెప్పారు. జెసిఐ తిరుపతి ఒడిస్సీ అధ్యక్షులు డాఎం లావణ్య రెడ్డి తాము చేసిన సామాజిక సేవా కార్యక్రమాల నివేదికను సమర్పించారు.అలాగే అతిథుల చేతులు మీదుగా వివిధ అవార్డులను బహుకరించారు. ఈ కార్యక్రమంలో జెసిఐ ఆంధ్రప్రదేశ్ జోన్ కోఆర్డినేటర్ ఎన్. మణిసందీప్, జెసిఐ తిరుపతి ఒడిస్సి కార్యదర్శి పి. కీర్తి, ప్రాజెక్ట్ చైర్మన్ డా. హరిత, వివిధ ప్రముఖులు, సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి

నారాయణవనం, అక్టోబర్ 12 ప్రభాతవార్త :

మండలంలోని దిగువకనకపాలెం దళితవాడకు చెందిన పెయింటర్ ఎన్ ప్రకాష్(32) బుధవారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. దిగువకనకపాలెం దళితవాడకు చెందిన ఆరుముగం కుమారుడు ప్రకాష్ ప్రతి రోజు పెయింటింగ్ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం ఉదయం యధావిధిగా పెయింటింగ్ పనులకు తిరుపతి సమీపం తిరుచానూరు పంచాయతీ పాడిపేట వద్ద ఓ అపార్ట్మెంట్‌లో పనులకు వెళ్లాడు. పనులు చేస్తున్న తరుణంలో విద్యుత్ తీగలు తగిలి అక్కడక్కడే మృతి చెందాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా వున్న ప్రకాష్ మృతితో గ్

గడప గడపకు భరోసా

-మోహిత్‌రెడ్డి పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి
-5పంచాయతీల అభివృద్ధికి రూ.1.25 కోట్లు నిధులు
-6రోజులు.... 7850 గడపలు...65 కిలోమీటర్ల సాగిన యాత్ర
-మంగళం పరిధిలో ముగిసిన మోహిత్‌రెడ్డి మహాపాదయాత్ర

తిరుపతిరూరల్, అక్టోబర్12 ప్రభాతవార్త: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని, పరిష్కరం చేసేందుకు తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేపట్టిన మహా పాదయాత్ర మంగళం పరిధిలో దిగ్విజయంగా ముగిసింది. ఈనెల 7వ తేదిన మంగళం పంచాయతీలైన తిరుమల నగర్, రణధీర్‌పురం, మంగళం క్వార్టర్స్, సప్తగిరి కాలనీ మరియు మంగళం పంచాయతీలలో చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' మహా పాదయాత్ర 6రోజులు...7850 గడపలు....65 కిలోమీటర్లు కొనసాగింది. బుధవారం రామచంద్రానగర్, చెన్నాయగుంట, బాలకృష్ణాపురం, మంగళం గ్రామం, మిట్టగాంధీపురం ప్రాంతాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపిపి మోహిత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే, ఎంపిపి పర్యటనలో ప్రజలు అడుగు అడుగున హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ ప్రాంతాలలో మీరు చేసిన అభివృద్ధి కనిపిస్తుందని ప్రజలు తెలిపారు. ఎంపిపి మోహిత్‌రెడ్డి గడప గడపలో మహిళలను అప్యాయంగా పలకరిస్తూ....సంక్షేమ పథకాలు అమలుపై ఆరా తీస్తూ...అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా అధికారులను ఆదేశిస్తూ ముందుకు సాగారు. మంగళం పరిధిలోని 5 పంచాయతీలకు రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసారు. చెన్నాయగుంట ప్రజల అభ్యర్థన మేరకు అయ్యప్ప ఆలయానికి స్థలం కేటాయింపుతో పాటు రహదారి నిర్మాణానికి రూ.5లక్షలు నిధులను మంజూరుకు మోహిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు మాధవరెడ్డి, కళలు, సాంస్కృతి శాఖ డైరెక్టర్ చిలమంద మునికృష్ణ, ఎంపిటిసి నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ వసంత అశోక్ కుమార్‌రెడ్డి, వైకాపా సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, శివశంకరరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ గౌనివారికి ఘన సన్మానం

తిరుపతి, అక్టోబర్ 12ప్రభాతవార్త: అధికార పార్టీ అక్రమ కేసుల్లో అరెస్టయి, జైలునుంచి ఇటీవల విడుదలైన మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులును బుధవారం తిరుపతిలో టిడిపి శ్రేణులు ఘనంగా సన్మానించాయి. బిసి కులాలపై వైకాపా ప్రభుత్వం అణచివేత ధోరణితో వ్యవహరిస్తోందని, ఇప్పటికే అక్రమంగా అరెస్టయిన ప్రతిపక్ష నాయకుల్లో బిసిలు ఇద్దరు, ఈబిసిలు ఇద్దరు, ఎస్సీలు 4ఉన్నారు. బిసిలకు పెద్ద పీటవేయడంలో టిడిపి స్థానాన్ని నిలుపుకుందని నేతలు అన్నారు. అక్రమ కేసుల నుంచి విముక్తి కలగాలని ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామినివేడుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం గజమాలతో గౌనివారిని తిరుపతి జిల్లా నేతలు ఆత్మీయంగా సన్మానించారు.

విద్యుత్ బకాయిల కేసులపై.. సకాలంలో స్పందించండి!

-సమగ్ర సమాచారంతోనే కేసుల పరిష్కారం

-ఏపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ విఎన్.బాబు

తిరుపతి ప్రెస్‌క్లబ్,అక్టోబర్ 12 ప్రభాతవార్త: ఏపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో విద్యుత్ బకాయిలకు సంబంధించిన కోర్టు కేసులపై సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి కేసులను పరిష్కరించుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంస్థ డైరెక్టర్లు విఎన్.బాబు (ఫైనాన్స్), ఎన్‌విఎస్. సుబ్బరాజులు (టెక్నికల్, హెచ్‌ఆర్‌డి)లు సూచించారు.సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఆదేశాల మేరకు సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం కేసులకు సంబంధించిన అంశాలపై డైరెక్టర్లు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తూరు,కడప,నెల్లూరు,కర్నూలు,అనంతపురం జిల్లాల్లో బకాయిలకు సంబంధించిన కేసులు ఎక్కువగా నమోదయినట్లు తెలిపారు.జిల్లా కోర్టులతో పాటు రాష్ట్ర హైకోర్టులో కూడా ఎల్‌టి,హెచ్‌టి సర్వీసుల బకాయిలకు సంబంధించిన కేసులు నడుస్తున్నాయన్నారు.మనవద్ద సమగ్ర సమాచారం అందుబాటులో ఉన్నట్లయితే కేసులను త్వరతిగతిన పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కేసుల పరిష్కారానికి సంస్థ అధికారులు,సిబ్బంది చొరవ చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్.వరకుమార్, డివి.చలపతి, కెఆర్‌ఎస్.ధర్మజ్ఞాని,జనరల్ మేనేజర్ డి.సురేంద్రరావు,ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లు సుబ్బారావు,బాలచంద్ర,రాజశేఖర్,ప్రసన్నకుమార్,సీనియర్ అకౌంట్ ఆఫీసర్లు మధుకుమార్,శ్రీనివాసులు,బాలాజి,వెంకటేష్,చిన రాఘవులు,మహబూబ్ బాషా,డిప్యూటీ జనరల్ మేనేజర్ జివిఎస్‌ఆర్.మూర్తి,లా ఆఫీసర్ పిఎం.జైకేష్ యాదవ్‌లు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించండి

-సీనియర్‌సివిల్‌జడ్జి కరుణాకరన్



శ్రీకాళహస్తి, అక్టోబర్ 12 ప్రభాతవార్త : లోక్ అదాలత్ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని మండల లీగల్‌సెల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి మరియు చిత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ కుమార్ అన్నారు. బుధవారం సమాజంలో నాలుగోస్తంభం అయిన పాత్రికేయు లతో బ్లూజీన్స్ యాప్ ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి చక్కనివేదికగా జాతీయ లోక్ అదాలత్ ఉందని దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ప్రజా స్వామ్యంలో న్యాయ వ్యవస్థ అంటే ప్రజలకు ఎలా ఉపయోగ పడుతుందో వివరించారు. చట్టాలపై ప్రజలకు విస్తృత ప్రచారం నిర్వహించేలా ప్రజలకు తెలిసేలా వార్తలు రాయాలని అప్పుడే ప్రజలకు అవగాహన ఉంటుందన్నారు. లోక్ అదాలత్ కేసులుకు అప్పీలు లేదని ఇక్కడ ఇచ్చిన తీర్పే అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పన్నారు. సివిల్, ఎంవిఐపి, వివాహ సంబంధ వ్యవహారాలు, ప్రైవేటు చిట్‌ఫండ్స్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. క్షణికావేశంలో చేసే తప్పులు, దొంగతనాలు చేస్తే వీటిని రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో పాత్రికేయులకు కూడా భాధ్యత ఉందన్నారు. చెక్‌బౌన్స్ కేసులు ఇద్దరి మధ్య ఒప్పందం కుదిరితేనే పరిష్కరించుకోవచ్చన్నారు. ట్రాన్స్‌జెండర్స్‌ను చులకనగా చూస్తున్నారని ఇందుకు జిల్లా వ్యాప్తంగా వీరికి న్యాయం చేయాలన్న లక్ష్యంతో వారివృత్తి ఏదైనా వారికి ఈ శ్రమ్ కార్డులు చిత్తూరు జిల్లాలోనే ప్రథమంగా అందించామన్నారు. కుప్పంలో 17వేలమంది రాతిపనివారికి ఈ శ్రమ్‌కార్డులను త్వరలోనే అందిస్తామన్నారు. న్యాయవ్యవస్థ నాలుగోదల మధ్య ఉంటుందని అయితే ప్రస్తుతం ప్రజల మధ్యకు వచ్చి ప్రజలకు న్యాయసలహాలను అందిస్తోం దన్నారు. ముఖ్యంగా దళితవాడల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయవిజ్ఞానసదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాత్రికేయులకు కూడా చట్టాలపై అవగాహన కలిగేలా పుస్తకాలను అందిస్తామన్నారు.

జగనన్న పథకాలే ప్రజలకు అండగా ఉంటాయి : ఎంఎల్‌ఏ

తొట్టంబేడు, అక్టోబర్ 12 ప్రభాతవార్త : జగనన్న పథకాలే ప్రజలకు అండగా ఉంటాయని, అర్హులందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందాలని ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి అధికారులను, వాలంటీర్లను ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా బుధవారం తొట్టంబేడు మండలంలోని గుండేలిగుంట సచివాయ పరిధిలోని విరూపాక్షపురం, కొత్తకండ్రిగ, హరిజనవాడ, గుండేలిగుంట గ్రామాల్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌ఏ పర్యటించారు. ఈసందర్భంగా గ్రామాల్లో ఎంఎల్‌ఏకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ ఇంటింటికి తిరుగుతూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సాగిన కార్యక్రమంలో అర్హత ఉన్న వారందరికీ త్వరలోనే ప్రభుత్వ పథకాలు అందించాలని వాలంటీర్లను ఆదేశించారు. అర్హులైన వారికి పథకాలు అందించాలని వాలంటీర్లను, అధికారులను ఎంఎల్‌ఏ కోరారు. గడపగడపకు పర్యటిస్తున్న ఎంఎల్‌ఏకు మహిళలు మంగళహారతులు, పూలతో స్వాగతం పలికారు. పలువురు వృద్ధులను పలకరిస్తూ ఫించన్ అందుతోందా లేదా అని తెలుసుకుని 2024లో కూడా జగనన్నను ఆదరించాలని కోరారు. అనంతరం సంక్షేమ పథకాలపై కరపత్రాలను పంపిణీచేశారు. అనంతరం ఎంఎల్‌ఏను పూలమాతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, వి.దర్మారెడ్డి, అర్జున్‌రెడ్డి, వెంకటయ్య, పి.వెంకటయ్య, రామయ్య, రత్నయ్య, రమణయ్య, చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పనిలో పారదర్శకత, జవాబుదారితనం కోసమే సమాచార హక్కు చట్టం

చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం అధికార యంత్రాంగంలో జరిగే పనులకు సంబంధించి పారదర్శకత, జవాబుదారితనం తీసుకురావడం కోసమే 2005 సంవత్సరంలో సమాచార హక్కు చట్టం తీసుకువచ్చిందని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ చట్టం ప్రకారం ప్రతి పౌరుడు తన హక్కు ప్రకారం కార్యాలయాల్లో సమాచారం కోరే హక్కు వుందని, నిర్ణీత కాల వ్యవధిలో సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు వుంటుందని ఆయన స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో బుధవారం సమాచార హక్కు దినోత్సవం సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యాలయం ఎదుట సమాచార హక్కు చట్టంకు సంబంధించిన అధికారుల పేర్లతో పాటు ఫోన్ నెంబర్లు అందరికి కన్పించేలా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఒకవేళ అధికారి బదిలీ అయితే వెంటనే బదిలీపై వచ్చిన కొత్త అధికారి పేరును వుంచాలన్నారు. అలాగే సమాచారం కోరిన వ్యక్తికి నిర్ణీత కాల వ్యవధిలోపు సమాచారం ఇవ్వకుంటే అతను పై అధికారికి విన్నవించుకోవాల్సి వుంటుందన్నారు. సమాచారం కోరిన వ్యక్తికి వీలైనంత త్వరగా సమాచారం ఇవ్వాలని లేదంటే సంబంధిత అధికారులు న్యాయ స్థానాల్లో సమాధానం చెప్పాల్సి వుంటుందన్నారు. ఒకవేళ ఎవరైనా ఇతర వ్యక్తులకు సంబంధించిన సమాచా రం కావాలని అడిగితే అధికారులు ఆ వ్యక్తి అనుమతి తీసుకొని సమాచారం అడిగిన వ్యక్తికి సమాచారం ఇవ్వాలన్నారు. ఇందుకు సంబంధించి రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని ప్రతి నెల మూడవ శుక్రవారం సమాచార హక్కు దినోత్సవంగా పాటించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎఒ కులశేఖర్, నగరి ఆర్డీఓ సృజన, పలు శాఖల అధికారులు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

తాత్కాలిక నగర పాలక సంస్థ భవనం ప్రారంభం

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 12, ప్రభాతవార్త : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని తాత్కాలిక భశనంలోని మారుస్తున్న సందర్భంగా బుధవారం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీషలు భవనాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యలయం వున్న ప్రాంతంలో సిటి ఆపరేషన్ సెంటర్‌ను నిర్మించడం జరుగుతున్నదని మరో 18 నెలల పాటు మెటర్నటి ఆసుపత్రి ప్రాంగణంలోని భవనంలో తాత్కాలికంగా నగర పాలక సంస్థ కార్యాలయం నిర్వహణ వుంటుందన్నారు.అనంతరం మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రకాలుగా పరిశీలించి తాత్కాలికంగా నగర పాలక సంస్థ కార్యాలయం నిర్వహించుకునేందుకు మెటర్నటి ప్రాంగణంలోని పాత డిఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయాన్ని కేటాయించడం జరిగిందన్నారు. అనుకున్న సమయంలోపు సిటి ఆపరేషన్ సెంటర్ పనులు పూర్తి చేయించి నగర పాలక సంస్థ నూతన భవనంలోకి వెల్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ భూమన అభినయ్ రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె బాబు, కార్పొరేటర్లు రామస్వామి, వెంకటేశ్వర్లు, శేఖర్ రెడ్డి, హనుమంత నాయక్, తదిరుపతి మునిరామిరెడ్డి, అమరనాథ రెడ్డి, రేవతి, బసవ గీత, నరేంద్రనాథ్, శ్రావణి మునిరామిరెడ్డి, శైలజా, దూది కుమారి, ఇమామ్, రుద్రరాజు శ్రీదేవి, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ రాధికారెడ్డి, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, దేవిక, రెవెన్యూ అధికారులు లోకేష్ వర్మ, సేతుమాధవ్, ఏసిపిలు షణ్ముగం, బాలసుబ్రమణ్యం, మేనేజర్ చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను పరిశీలించిన డీఈవో శేఖర్

బీఎన్ కండ్రిగ, అక్టోబరు 12 ప్రభాతవార్త: మండలంలోని బీఎన్ కండ్రిగ మండలం కల్లివెట్టు,నెలవాయి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను డీఈవో శేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో పలు పాఠశాలలను సందర్శించిన ఆయన కల్లివెట్టు పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు సాంఘీక శాస్త్రం పాఠం బోధన చేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి వారి సమాధానాలతో సంతృప్తి చెందారు. రాబోవు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని అందుకు ముందస్తు ప్రణాళికతో ఉపాధ్యాయుల సహకారంతో మంచి మార్కులు సాధించాలన్నారు. పనులు ఇటుక రాల్లు నాణ్యత ప్రమాణాలు బాగున్నాయని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. వారి వెంట ప్లానింగ్ కో-ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఎంఈవో రవీంద్రనాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యుశ్రీ, మురళి తదితరులు పాల్గొన్నారు.

అమర ఆస్పత్రిలో అద్భుతం

చిన్నారి బాబుకు బొటనవేలు సర్జరీ చేసిన వైద్యులు

ఆస్పత్రి పెట్టింది వైద్యసేవ కోసం - డాక్టర్ రమాదేవి గౌరనేని

రేణిగుంట, అక్టోబరు 12 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి అమర ఆస్పత్రి వైద్యులు 9 నెలల చిన్నారి బాబుకు తెగిన బొటన వేలును శాస్త్ర చికిత్స ద్వారా అమర్చారు. వివరాలు ఇలా... 9 సంవత్సరాల చిన్నారి బాబు తన అన్నతో ఆడుతుం డగా పదునైన టైరింగ్ కత్తితో అతని అన్న బాబు బొటన వేలును కత్తిరించాడు. దీంతో వేలు తెగి విడిపోయింది. ఏమి చేయాలో తెలియని బాబు తల్లిదండ్రులు బాబును, తెగిన వేలును తీసుకుని అమర ఆస్పత్రికి పరుగులు తీశారు. ఆస్పత్రిలో ప్రముఖ హ్యాండ్ మైక్రో సర్జరీ వైద్యనిపుణులు వాసుదేవరెడ్డి బాబు పరిస్థితిని గమనించారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా బాబు బొటన వేలును ఐదు గంటల పాటు తమ సిబ్బందితో కలసి శస్త్ర చికిత్స(మైక్రో రీ ప్లాంటేషన్) చేసి యథా స్థానంలో అమర్చారు. ఆస్పత్రి యాజమాన్యానికి వైద్యులకు ఆనంద బాష్పాలతో ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా మరో యువకుడు ఆత్మహత్యాయత్నంలో భాగంగా రైలు కింద పడి తెగిన కాలును సర్జరీ చేసి అతికించారు. స్రుతం అతను ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి ఎండీ డా. రమాదేవి గౌరినేని మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవలు అందించడానికి అమర ఆస్పత్రి ఉందన్నారు. తన భర్త ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ గౌరినేని తమ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆస్పత్రి నిర్మించినట్లు తెలిపారు. సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్ సుదర్శన్, చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వేణుగోపాల్, ఎగ్జిక్యూటీవ్ నరసింహారావు, మునినాథం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

డెబెల్ ప్రయోగశాలలో..తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి

తిరుపతి,అక్టోబర్ 12ప్రభాతవార్త: డిఆర్‌డిఓ బెంగుళూరు ఆధ్వర్యంలోని డెబెల్ ప్రయోగశాలను తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, స్వీమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, ఆంకాలజిస్ట్ స్పెషలిస్ట్ ఆఫీసర్ డాక్టర్ జయచంద్ర బృందం సందర్శించారు. ఈ సందర్భంగా డెబెల్ డైరెక్టర్ డాక్టర్ టిఎం కొట్రేష్, డెబెల్ సైంటిస్ట్ మోహనవేలు ప్రయోగశాలలో బయోమెడికల్ ఇంప్లాంట్స్ తయారీపై వివరించారు. ఎక్సో స్కెలిటిన్ సిస్టం పరికరాన్ని ఎంపి డాక్టర్ గురుమూర్తి స్వయంగా పరీక్షించారు. మానవశరీరంలోని కీళ్ళు,ఎముకలు బలహీనమైనప్పుడు, వివిధ కారణాలతో ఆపరేషన్ జరిగి రోగి నడిచేందుకు బాహ్య మద్దతు అవసరమైనపుడు ఈ ఎక్సో స్కెలిటిన్ సిస్టం ఉపయోగపడుతుందని చెప్పారు. శాంపిల్ జాయింట్‌లను డెబెల్ సంస్థ ఎంపి డాక్టర్ గురుమూర్తి బృందానికి అందజేశారు.